# ప్రజ్ఞాపూర్ చౌరస్తా

**రాజీవ్ రహదారి** ఒంటిమీద హైద్రాబాద్‌కు వచ్చిపోయే వాహనాలతో ప్రజ్ఞాపూర్ చౌరస్తా 'నిత్య కళ్యాణం పచ్చతోరణం' లెక్కుంటుంది. చుట్టూ నాలుగైదు ఊర్లకు అదే బస్టాండు. 'పుట్ట చుట్టు చోమలోలె' ఎప్పుడూ జనాలక్కడ తచ్చాడుతుంటారు. చౌరస్తాకు ప్రక్కన హోటల్. హోటల్ ఆవరణలో రేకులషెడ్డు. షెడ్డు లోపల నర్సింలు ఆగమాగంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. నర్సింలుకున్న దొక్కటే కన్ను. అయినా ఒళ్ళంతా కళ్లుచేసుకొని అప్పటికే షెడ్డు చుట్టూ దేవులాడి వచ్చిండు. చుక్క కనబడలేదు. లోపల అనుమానం పాములు బుసలు కొడుతుంటే చుట్టురా తిరిగి షాపులన్నీ వెతికొచ్చిండు. అయినా చుక్క జాడలేదు.

ప్రతి రోజు తెల్లారగట్ల, తూర్పు ఆకాశం ఎర్రబొట్టు పెట్టుకోక మందే చుక్క తనను నిద్రలేపి "జల్ది ముంత పట్టుకుని పొయ్యిరా నర్సింహా! పొద్దెక్కితే జనాలు తిరుగుతుంటరు" చెవుల జోరిగైపోయేది. అప్పటికే చుక్క కట్టెలపొయ్యి మీద పల్లికాయ్యలు వేయించి బుట్ట నింపుకుని తయారుగుండేది. తాను పాత ప్లాస్టిక్ బకెట్టందుకుని, జగ్గుతో సహా దూరం వెళ్లేవాడు. ముంతపని పూర్తి చేసుకొని బజారు బోరింగ్ వద్ద స్నానం ముగించుకొచ్చేవాడు. ఆలోగా చుక్క చీర సింగారించుకుని భోనగిరి బొమ్మలెక్క తయారయేది. ఇద్దరూ కలిసి వేడి చాయలో బన్ను అద్దుకుని తినేవారు. తాను ప్లాస్టిక్ ప్లేట్లో ప్యాకెట్ ఫుడ్స్ – బిస్కట్లు వగైరాలు సర్దుకుని మెడలో వేసుకోగానే, ఇద్దరూ ఒకేసారి బస్టాండు చౌరస్తా చేరుకునేవారు. బస్టాండులో ఆగిన బస్సుల చుట్టూ అరుస్తూ, తిరుగుతూ అమ్మకాలు సాగించేవారు. ఆకాశం నిండా వెలుగు విచ్చుకుంది, చుక్క పక్కనుంటే లోకం పచ్చగా కనబడేది. కానీ, రాత్రికి పక్కనే పడుకున్న చుక్క తెల్లారేసరికేమైంది? పొద్దున ఒళ్ళు విరుస్తూ నిద్రలేచే సరికి వాహనాల రొద వినపడుతోంది. కానీ, చుక్క కనబడలేదు. షెడ్డు గోడ కొరిగి కూచున్నాడు. చుక్క కోర వైసులుంది. దోరమాగిన జాంపండు మొఖం, పొడగాటి జడ,... కుడికాలు వంకరైనా బక్కగా అందంగా వుంటుంది. ఎటు పోవాలన్నా తనకు చెప్పి పోతుంది. ఈసారెందుకు చెప్పలేదు? మూరెడు పొద్దెక్కినా ముంత పట్టుకెళ్ళడం తప్పలేదు. స్నానం చేయాలన్పించలేదు. అది సగం కుంటి, నేను సగం గుడ్డి... అది లేకపోతే నాకెందుకింత ఇది? మాయదారి మనసు కోతి కొమ్మాడుతుంది. బస్టాండులో బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ ఆగింది. ప్లేటు మెడకు తగిలించుకుని ఉరికిండు. అరుస్తూ బస్సు చుట్టూ తిరుగుతున్నడు. "బిస్కిట్లు, చాక్లెట్లు, కార పొట్లాలు... అమ్మా... అయ్యా... తాజాగున్నయి..." మనిషక్కడున్నా మనసెక్కడో వుంది. **ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో** బస్సులన్నీ ఆగి సేదదీర్చుకుంటాయి. ప్రయాణీకులు టిఫిన్లు, భోజనాలు ముగించుకుని ఆకలి కేకల్ని చల్లార్చుకుంటారు. ఏ బస్సు ఆగినా మక్క కంకులు, వేయించిన శనిగలు, పల్లికాయలు, పళ్లు, స్నాక్స్ ఇంకేవేవో అమ్మే వాళ్లంతా చుట్టుకుంటారు. రోడ్లపక్కన డబ్బా హోటల్లు, పూల దుకాణాలు, క్షౌరశాలలు ఇంకేవేవో పొద్దున రెక్కలు విప్పి రాత్రికి మూసుకుంటాయి.

చౌరస్తా పక్కన పెద్ద హోటలుంది. దాని ఆవరణలోనే రోడ్డువైపు రేకుల షెడ్డు... చుక్క–నర్సింలు నివాసం. వాళ్లందులోకి రాకముందు... ఓ రోజు అర్ధరాత్రి హోటల్లో దొంగలు పడి చాలా దోచుకెళ్లింద్రు. మర్నాడు హోటలు యజమాని వచ్చి నోరు దెరిచిండు. రాత్రిగూడా కాపలా కావాలి... నిర్ణయించుకున్నడు. అరుగుల మీద పడుకున్న చుక్క, నర్సింలను తోలుకపొయ్యి షెడ్డు అప్పగించిండు. కాపలా కుక్కల్లాగున్నారు. రాత్రి పది తర్వాత హోటల్‌కు తాళం పడుతుంది.

నర్సింలు తల్లి అక్కడే మక్క కంకులు, పండ్లు అమ్ముతుండేది. తన తండ్రి ఎవరని నర్సింలు

అడగలేదు. తల్లి చెప్పలేదు. "చిన్నప్పుడే అమ్మవారై నీకో కన్ను పోయిందిరా!" అని మాత్రం చెప్పింది. సర్కారు బడికి తోలిచ్చేది. పాముకాటుతో పరలోకాని కెళ్లిపోయింది. చచ్చేముందు నురగలు కక్కుతూ "దిక్కులేనోళ్లకు దేవుడే దిక్కు కొడకా" అంది. అమ్మమీద పడి వెక్కివెక్కి ఏడుస్తుంటే చుట్టూ జనాలు మూగిండ్రు. అమ్మనెటో గుంజుకుపోయిండ్రు. అమ్మలేని బతుకు ఆగమైంది. "గాలికి పుట్టినోడు గాలికే పెరుగుతడు" అన్నారంతా. చుక్కకు గూడా తండ్రి గురించి తెల్వదు. బురదగుంటలో అరవిరిసిన కలువపూవు లెక్కుండేది తల్లి. వయసు అల్లరి భరించలేక పేగుబంధాన్ని పుటుక్కున తెంపుకొని ప్రియుడితో లేచిపోయింది. అప్పుడు చుక్కకు ఎనిమిదేళ్లు. తల్లి కనబడలేదని తల్లడిల్లి పోతుంటే చౌరస్తా జీవులు ఊరడించారు. నర్సింలు తోడయిండు. ఓసారి చుక్క పల్లీలమ్ముతూ బుట్టతో అటూ ఇటూ ఉరుకుతోంది. రోడ్డుమీద యమ స్పీడుగా వస్తున్న హీరో హోండా గుద్దేసి కాలుమీది నుంచి వెళ్లిపోయింది. కెవ్వున కేకేసింది. చూసినోళ్ల ప్రాణాలు జివ్వుమన్నె. అంతా కలిసి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించిండ్రు. కాలు విరిగింది. ఆపరేషనైంది. నర్సింలు వెంటున్నాడు. తోడూ-నీడగా సేవలందించిండు. విరిగిన కాలు అతికింది. కాని, వంకర అట్లానే ఉండిపోయింది. ఆ తర్వాతనే షెడ్డు ఆశ్రయం దొరికింది.

ఆగని కాలచక్రం ఐదేండ్లు తిరిగింది. ఆ రోజు... చుక్క బస్సు గిరాకీ నొదిలేసి మధ్యాహ్నాం కాకముందే షెడ్డులో దూరింది. తాను వెంబడించాడు. మోకాళ్ళ మధ్య తలపెట్టి ఏడుస్తోంది. "ఏమైంది చుక్కా?" అడిగిండు. "న్నా... నాకా?" తలపైకి లేపి పిరికిణీ కొసతో కళ్లద్దుకుంది. "ఏమో... జెర గా హోటల్ నర్సవ్వను పిలువ్" దీనంగా అడిగింది, నర్సవ్వ హోటల్లో రోజు కూలి. పిలవగానే నర్సింలు వెంటవచ్చింది. చుక్కతో గుసగుసలాడింది. నర్సవ్వ మొకం బంతిపూవోలె విచ్చుకుంది. బకెట్టుతో బోరింగు నీళ్లు తెమ్మన్నది. తెచ్చి ఇవ్వంగానే తనను బయటకు పంపించింది. ప్లేటు మెడ కేసుకొని వెళ్లి చెట్టుకింద నిల్చున్నడు. బస్సులో పైసలడుక్కునే కుంటి నారాయణ వచ్చి "ఏందిరా పిల్లగా! ఎడ్డి ముండకొడుకు లెక్క ఎటు చూస్తున్నవ్? అడిగిండు. విషయం చెప్పిండు. ఇద్దరూ కలిసి షెడ్డు దగ్గరికి నడిచిండ్రు. షెడ్డులోంచి వెళ్లిపోతున్న నర్సవ్వ నాపి"ఏమైందే నర్సా?" అడిగిండు నారాయణ. అతని చెవిలో ఏదో, చెప్పి వెళ్లిపోయింది. నారాయణ నవ్వుతూ "ఏంలేదురా! చుక్క పెద్దమనిషైందట్రా!" చెప్పి వెళ్లిపోయిండు.

తలంటు స్నానంచేసి కూచున్న చుక్క జుట్టులోంచి నీటి బిందువులు ముత్యాలోలె రాలి పడ్తున్నె. కళ్లు మిలమిలా మెరుస్తున్నె. ఐదు రోజులు చుక్క షెడ్డు నుండి బయటకు రాలేదు. నర్సవ్వ రోజూ వచ్చిపోయింది. షెడ్డులున్న నర్సింలు ఆలోచనా లోచనాల్లో చుక్కనే కదుల్తోంది.... బుర్ర వేడెక్కింది. వెళ్లి చింతచెట్టు నీడలో కూచున్నాడు. షోలాపూర్ ఎక్స్‌ప్రెస్ చుట్టూ తిరిగి అడుక్కున్న నారాయణ చెమటోడుస్తూ వచ్చిండు. చంకకర్రలు పక్కన బెట్టి "నీ యవ్వ! బస్సు చుట్టూ బతుకమ్మ లాడినట్టు మూన్నాల్లుసార్లు తిరిగితే ముప్పై రూపాయలన్నా పడలేదురా!" అంటూ నర్సింలు పక్కన కూచున్నాడు. తుండు గుడ్డతో చెమట అద్దుకుంటూ "చుక్క కనబడ్డం లేదేమిట్రా?" భుజమ్మీద చెయ్యేసిండు. ఎటో చూస్తున్న నర్సింలు ఉలిక్కిపడిండు. "అరె! ఏమైందిరా నర్సింలు? చాయ దాగినవా?" గదవ పైకెత్తి కళ్లలోకి చూసిండు. నర్సింలు ఒంటి కన్నును నీటి పొరలు కమ్ముకున్నె. "పెద్దయ్యా! పొద్దుగాల్ల లేచి చూసేసరికి చుక్క కనబడలేదే! రాత్రికి రాత్రి ఏమైపోయిందో!" గొల్లుమన్నడు. నారాయణ బుర్ర గిర్రుమన్నది. తుండుగుడ్డతో నర్సింలు కళ్లద్దుతూ నలుగుర్ని పిలిచి చుక్క సంగతి చెప్పేసిండు... పరేషానెందుకూ? ఆ పోరి బ్రైగ్నపురం ఊర్లెకు పోయిందేమో!" వాటర్ పాకెట్లమ్మే మల్లయ్య సందేహం.

అయినా.. దాని కోసం నువ్వెందుకంత ఇదైపోతున్నావురా! అది నీకెమన్నా చెల్లెలా లేక పుస్తె కట్టిన పెండ్లామా?" నారాయణ మందలింపు "మన బస్టాండు బతుకులంటే అంగట్ల అవ్వా అంటే ఎవనికి పుట్టినవ్ బిడ్డా' అన్నట్టు గిట్లనే ఉంటయిరా!" ధైర్యం చెప్పిండు. విశ్రాంతి కోసం అటువైపు వచ్చిన నర్సవ్వ ముంగురుల్ని సవరించుకుంటూ సానుభూతి వెలిబుచ్చింది. నలుగురు నాల్గు రకాలు మాట్లాడింద్రు. బాసర బస్సొచ్చి బస్టాండ్ల ఆగింది. తుపాకి దెబ్బకు చెల్లాచెదురైన చెట్టుమీది పిట్టలోలె చెట్టుకింది మనుషులు చెదిరి పోయింద్రు. నర్సింలు ఒంటరైపోయిండు. పొత్తి కడుపుల నుంచి తన్నుకొస్తున్న దుఃఖాన్నాపుకో లేక తనివిదీర ఏడ్చిండు. తిరిగి షెడ్డు కెల్లిండు. చాయ బన్ను తినాలన్పించలేదు. పల్లికాయల బుట్టల చుక్క కన్పించింది. కాళ్ల కడుపులకు ముడుచుకుని కూచున్నాడు. షెడ్డు దెయ్యం గుహలా కనబడింది. హోటల్లోకి జనాలు వస్తూ పోతున్నారు. తనను పలుకరించే వారెవరు? మధ్యాహ్నం నారాయణ వచ్చిండు. మందలించి బన్ను తినిపించి పోయిండు. జైలు గదిలో ఒంటరి ఖైదీలెక్క కూచున్నాడు. చుక్కకోసం వెయ్యి కళ్లతో ఎదిరి చూస్తున్నాడు.

సాయంత్రం నాలుగైంది. బుర్రలో ఓ మెరుపు మెరిసింది. ప్రజ్ఞాపూర్ ఊళ్లోకెళ్లి షావుకారు దుకాణం ముందు నిల్చున్నాడు. "సేటూ! మా చుక్క వచ్చిందా?" గొంతు వణికింది. "రాలేదు నర్సింలూ! కొత్తరకం ఖారా పాకెట్లొచ్చినై. తీస్కపో. బాగా అమ్ముతయి" ఖారా పాకెట్ చూపించాడు. తిరిగొచ్చేటప్పుడు తెలిసినోళ్ళ నడిగిండు. తెలీదన్నారు. ఒకామె కళ్లు పెద్దగా చేసి "మాంచి వైసులంది. మాగిన మామిడి పండోలుందని ఎవడన్నా లేపుకు పోయిండేమో!" బుగ్గలు నొక్కుకుంది. "ఛీ...నీ యవ్వ!" కాండ్రించి ఉమ్మేసిండు. సాయంత్రం ఆకాశం నుండి చీకటి పరదాలు దిగుతున్నై. డ్యూటీ ముగించుకుని నర్సవ్వ ఇంటికెల్తూ "ఏం తమ్మీ! చుక్క కనబడిందా?" అడిగింది. ఏడుపొచ్చింది నర్సింలుకు. "ఏడ్వకు తమ్మీ. అదే వస్తుందిలే" ధైర్యం చెప్పి వెళ్లింది. రాత్రి పదైంది. నర్సింలు కడుపు నిండా బాధ. ఖాళీ లేదు. అన్నం తినాలన్పించ లేదు. అయినా ఎవరు వండి పెట్టింద్రని? హోటల్‌కు తాళం పడింది. గుండె పీచుపీచు మంటోంది... "చీ నీ యవ్వ! నాదో బతుకేనా? చిన్నప్పుడే తెగిన పతంగినై పోతి. పక్కన చుక్కవుంటే అంతా చక్కగా కనబడేది. బుర్రబోనుల ఆలోచన ఎలుకలు ఉరుకులాడుతున్నై. కళ్లు మూసుకుని పడుకున్నడు. ఎప్పుడు కన్నంటుకుందో తెల్వదు.

"నర్సింలూ... ఓ నర్సింలూ!" కోయిల స్వరం కమ్మగా వినబడింది. కల చెదిరినట్టు దబుక్కున లేచి కూచున్నాడు. కళ్లు నులుముకుని ఆబగా చూశాడు. తెల్లారిపోయింది. ఎదురుగా చుక్క..! మోకాళ్లు, పిక్కలను నేల మీదానించి కూచుని తననే చూస్తోంది. ఆశ్చర్యం... అద్భుతం... ఆనందం... అయ్యో! ఇది కలనా నిజమా? మరోసారి ఒళ్లు గిల్లుకున్నడు.

కల కాదు... నిజం... పచ్చి నిజం. ముందు కూచుని ముసిముసిగా నవ్వుతున్న ముద్దులగుమ్మ... తన చుక్కనే కానీ చీర కట్టుకుంది. సంతోషం ఆపుకోలేక అరచేతులందుకుని కళ్ల కద్దుకున్నడు. గాజుల గలగల గమ్మతుగా.. మత్తుగా వుంది. ఆవేశానందం కట్టలు తెంచుకుంది "చు...చుక్కా! వచ్చినవా!"

"పరేశానైనవా నర్సింలూ ?" నుదురునుపెదాలతో తడిమింది. ఇద్దరి నరాల్లో సరికొత్త స్వరాలు. ఇంత దగ్గరగా ఎప్పుడూ లేరు. అనుభవం, అనుభూతి... అమోఘం.

"ఎక్కడికి పోయినవు చుక్కా?" అంతరాళాల్లో పొంగిన అష్టమ సముద్రం పొంగులు పెదాలను వణికించినై. "నేనొచ్చేసరికి అర్ధరాత్రి దాటింది నర్సింలూ!" కళ్లు అరతచేతులంతయినై. చుక్క మొహం చందమామోలైంది. షెడ్డు బృందావనం లెక్కుంది నుదిటి బొట్టు ఆకాశంలో సూర్యోదయం లెక్కుంది.

"నువు లెవ్." అమాంతం ఒడిలోకి లాక్కుంది. ఒడి చల్లగా హాయిగా వుంది. పుట్టెడు కష్టాలు చిటికెలో తీరినట్టుంది నర్సింలుకు. "నన్నిడిచి ఎటుపోయినవ్?" ఒడిలో పసిపిల్లాడై పోయిండు.

"మొన్న రాత్రి నువు నిద్రపోయినవు. ప్రజ్ఞపురం నుంచి తెలిసిన పెద్దమనిషొచ్చిండు. వాళ్ల కొడుకు పెండ్లంట. పెండ్లిల పనిచేస్తే రోజుకు ఇన్నూరు రూపాయలిస్తనన్నడు. సరేనన్న. నిన్ను లేపి చెప్తానన్నాను. నువులేస్తే రానివ్వవని వద్దన్నడు. వాళ్ల పెండ్లి బస్సులనే హైద్రాబాదు పోయిన. చెప్పిన పని చేసిన, అక్కడనే కడుపునిండా తిన్న. పెండ్లయినంక అదే పెండ్లి బస్సుల వాళ్లతో వచ్చిన. చానా రాత్రయింది. ఇగో...రెండ్రోజులకు కూలి, చీర వాళ్లు పెట్టిండే." జాకెట్లోంచి నాలుగు వందనోట్లు తీసి చూపించింది. "మనిద్దరి కోసం లడ్డూలు, ఖార తెచ్చిన, నువు జెల్ది తయారుగా. తిందాం."

నాలుగు కళ్లు శ్రావణ మేఘాలైనాయి.

"ఇంకేంది? ఇంగ పెండ్లి జేసుకుందాం!" గుండెలు గుసగుసలాడుకున్నై.

--- 0 ---

(బతుకమ్మ, తేది.18-11-2012)

కథా నిలయం శ్రీకాకుళం

